క్లుప్తంగా

జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా గంజి భావన వశిష్ఠ



భీమడోలు: పూళ్లకు చెందిన గంజి భావన వశిష్ఠ జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైంది. దేశ వ్యాప్తంగా జనవరిలో జరిగిన ఎస్ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ మెయిన్స్ పరీక్షల ఫలితాలు గురువారం రాత్రి విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో భావన వశిష్ఠ జాతీయ స్థాయిలో ప్రతిభను చాటి 5,455 ర్యాంక్‌ను సాధించి ఉద్యోగాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈమె ఉంగుటూరు మండలం సచివాలయం 2లో మహిళా కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తిస్తుంది. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు భావనను ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష్మీదేవికి విశేష పూజలు



లక్ష్మీదేవి ప్రత్యేక పూజలు

దెందులూరు: గ్రామంలోని విష్ణు ఆలయంలో శుక్రవారం పాల్గుణ మాసం ఉత్తరాయణం పౌర్ణమి రోజునలక్ష్మీదేవికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు ఆవుపాలతో అభిషేకంచేశారు. అధిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా భీమేశ్వర, వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు



గోదావరి కాల్వలో శివునికి త్రిశూల స్నానం

భీమడోలు: మండలంలోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం శివాలయం అర్చకులు కాళ్లకూరి ఉమాశంకర్ శర్మ వేంకటేశ్వర స్వామి అర్చకులు పవన్‌ల ఆధ్వర్యంలో గోదావరి కాల్వ రేవు వద్ద త్రిశూల స్నాన్నం ఘట్టం జరిగింది. భీమడోలు నుంచి మంగళవాయిద్యాల నడుమ భక్తులు స్వామిని ఊరేగిస్తూ గోదావరి కాల్వ వద్దకు తీసుకుని త్రిశూల స్నానం చేయించారు. భక్తులు గోదావరి స్నానం చేశారు. అనంతరం ఆలయాల్లో స్వామి వార్లకు విశేష పూజలు చేశారు.

స్వామివారి సేవలో పలువురు ప్రముఖులు



స్వామి వారికి నూతన వస్త్రాలను అందిస్తున్న ఎం.ఆదిశేషు, పార్థసారథిలు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అబ్కారీ శాఖ మాజీ కమీషనర్ మామిళ్లపల్లి ఆదిశేషు, పెద్దలు మామిళ్లపల్లి పార్థసారధిలతో పాటు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు స్వామి వార్లకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వగ్వాల అచ్యుతరామారావు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెంలో జంగారెడ్డిగూడెం-ములగలంపల్లి రోడ్డు నిర్మా ణం చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ములగలంపల్లి నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకు అన్యాక్రాంతంగా ఉన్న రోడ్డుని నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. రోడ్డుపై వస్తున్న దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డును నిర్మించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కోట్ల రూపాయలు రోడ్ల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మించడంలో విఫలమవుతుందన్నారు. అధ్యక్ష కార్యదర్శులు కులపాకుల వీరాజు, పిల్లి చంటి, పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏసురాజు

ఏలూరు(మెట్రో): ఏపీబీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పామర్తి ఏసురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగాఉన్న ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్ రిటైర్డ్ అవడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని నాయకులు కలిశారు.

మండే ఎండ.. కానరాని నీడ

- చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏవీ?
- ఓ పక్క మంచు... మధ్యాహ్నం భానుడు ప్రతాపం



భీమడోలు-కొవ్వూరు రోడ్డుపై కురుస్తున్న పొగమంచు



గుండుగొలను వద్ద జనం లేక వెలవెలబోయిన జాతీయ రహదారి

భీమడోలు: మండలంలో మండుతున్న ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికి తోడు ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందులకు గురి చేస్తుంది. దూర ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చినవారు దాహార్తితో అలమటిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగుతున్నా వాటి జాడ కానరావడం లేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి వస్తే ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బస్టాప్‌ల వద్ద నిలుచోవడానికి అరుదైన ప్రదేశం లేక ఎండలోనే రోడ్లపై వేచి ఉండాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఓ పక్క ఉదయం 8 గంటల వరకు మంచు దట్టంగా కురవగా, ఉదయం 11 గంటలనుంచి భానుడు తన ప్రతాపాన్ని ప్రజలపై చూపాడు. దీంతో ఎండలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఉదయం మంచు తెరల్లో రహదారులు నిండిపోగా, మధ్యాహ్నం 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయి. దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో 3 నెలలపాటు ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రోడ్లపైకి రావాలంటేనే భీతిల్లిపోతున్నారు. ఉదయం రోడ్లపై మంచుకురవడంతో వాహనచోదకులు బైక్‌లు, బస్సుల వెలుతురులో రాకపోకలు సాగించారు. మధ్యాహ్నం రోడ్లన్నీ జనంలేక వెలవెలబోయాయి. దీనితో ప్రజలు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకునేందుకు రోడ్లపైకి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. మండుతున్న ఎండల్లో నల్లని దుస్తులు వాడవద్దని అనారోగ్యం బారిన పడతారని, ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని, ఎక్కువ మంచి నీరు, కొబ్బరి నీళ్ల తాగి సేద తీరాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో వెళ్లే వారంతా ముఖానికి మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెదవేగి : పెదవేగి మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్య కుమార్ అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీ.శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హరజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

12 మంది జూదరుల అరెస్ట్

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు 12 మంది జూదరులను అరెస్ట్ చేశారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలంలోని అమ్మపాలెం గ్రామంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పెదవేగి పోలీసులు దాడి చేసి శుక్రవారం రాత్రి 12 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 53 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే 7 ద్విచక్ర వాహనాలను, 17 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో పెదవేగి ఎస్సై రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురమ్మల ఆలయానికి పోటెత్తిన భక్తులు



పిప్పరలో ముగ్గురమ్మలకు గరగలసేవ నిర్వహిస్తున్న దృశ్యం

గణపవరం: గణపవరం మండలం పిప్పర గ్రామ దేవతలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఉత్సవాలు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఇందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఉత్సవాల ప్రారంభం రోజైన గురువారం రాత్రి అమ్మవార్ల గవళ్లగుడుపు సేవ జరిగింది. పిప్పర పరిసర గ్రామాల నుంచేకాక మండలంలోని పలు గ్రామాలనుంచి ప్రజలు పెద్దసంఖ్యలో గవళ్లగుడుపు సేవలో పాల్గొన్నారు. అమ్మవార్ల ఆలయాలకు రంగులువేసి ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాప అమ్మవార్లను దర్శించుకుని,నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్

పెదవేగి: అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణ పరిష్కరించాలని కోకో రైతుల సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం పెదవేగి మండలం విజయరాయి గాంధీ నగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో కోకో రైతుల సమావేశం మున్నంగి సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో గాంధీనగర్ లోని సీతా రామ కళ్యాణ మండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతు సంఘాల రాష్ట్ర నాయకులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు జరుగుతుందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అత్యధిక సాగు ఉందని చెప్పారు. అన్ని జిల్లాల నుంచి కోకో రైతులు పెద్ద ఎత్తున రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, కోకో రైతులు కోనేరు సతీష్ బాబు, గారపాటి పూర్ణచంద్రరావు, నాగరాజు శ్రీనివాస రాజు,జాస్తి కాశీ బాబు, బొల్లినేని ప్రసాద్, పాలడుగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బైబిల్‌లోని అంశాలను పాటించాలి



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ప్రతి క్రైస్తవుడూ బైబిల్‌ను చదవాలని, అందులోని అంశాలను పాటించాలని నగరంలోని అమలోద్భవి కథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ సూచించారు. ప్రతి ఏటా అమలోద్భవి కథీడ్రల్‌లో తపస్సుకాలంలో నిర్వహించే కూటముల్లో భాగంగా ఈ ఏడాది తపస్సు కాలంలో ఏసుతో ప్రయాణం పేరిట కూటములు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇహలోక వ్యామోహాలతో, స్వార్థంతో దేవునికి దూరమైన విశ్వాసులు తిరిగి ఈ ఉపవాస కాలంలో ఆయన చెంతకు రావాలని కోరారు. ఈ ఉపవాస కాలంలో భక్తులు మరింత నిష్ఠగా, ఫలవంతంగా ఉపవాసం చేసి పేదలకు దాన ధర్మాలు చేయాలన్నారు. తొలుత ఏసుప్రభువుని శిలువ శ్రమలు, వేద మరణానికి సంబంధించిన 14 స్థలాల ధ్యానాంశాలను ప్రార్థించి పరిశుద్ధ బైబిల్ గ్రంథాన్ని ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూజివీడు టౌన్ విచారణ కర్త ఫాదర్ లాము జయరాజు ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొనగా ఫాదర్లు టి.ఇమ్మానియేలు, బి.రాజు, ఎస్ విద్యాసాగర్, కార్పొరేటర్ నిర్మల, ఎస్ థామస్, జె.బెనర్జీ, ఐ.రత్నరాజు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

యానిమేటర్లపై అధికారుల వేధింపులు ఆపాలి

కుక్కునూరు: వెలుగు యానిమేటర్లపై పని భారం తగ్గించి అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్న సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో యానిమేటర్ల సమావేశం దాసరి సౌజన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం చాలీచాలని గౌరవ వేతనాలతో ఇబ్బంది పడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అదజేస్తున్న యానిమేటర్లు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే యానిమేటర్లకు కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఇకనైనా కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి యానిమేటర్లకు రూ.10 లక్షల బీమా, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుర్రగేసి, మేడవరపు రమాదేవి, కుక్కునూరు ప్రవంతి, అనురాధ, మాధవి, రామల్ల అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఒంటిపూట బడులు

- అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు పూటల బడులు
- ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్న తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రం

దెందులూరు: ఎండలు మండుతున్న ఈ సమయంలో కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు ఆక్షేపిస్తున్నారు. శనివారం నుంచి పాఠశాలలకు ఒంటి పూట బడులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఆదేశాలను పాఠశాలలకు పంపారు. ఆయా పాఠశాల హెచ్‌ఎంలు ఇప్పటికీ శనివారం నుంచి ఒంటిపూట బడులను ప్రకటించారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎండలకు తట్టుకునే వయసున్నప్పటికీ వారికి మాత్రం ఒంటిపూట బడులు ఏర్పాటు చేసి ఎండలు తట్టుకోలేని అంగన్‌వాడీ చిన్నారులకు బడులు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఒకలాగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకలాగా బడులు నిర్వహించటమేమిటని ఇదేమి పని అని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు ఎండలు మండిపోతున్నాయని ఇంటి నుంచి బయటకు రావడానికి సైతం భయపడుతున్న తరుణంలో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలా ఉంటారని ఏమాత్రం ఆలోచన కూడా ప్రభుత్వ పెద్దలకు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా ఆలోచించకుండా ఏకపక్షంగా బడుల నిర్వహణపై లికిత పూర్వక ఆదేశాలు ఇవ్వటం ముమ్మాటికి తప్పేనని అంటున్నారు. చిన్నారులకు కూడా ఒంటిపూట బడులు ప్రకటించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకోవాలి:
ఒంటి పూటబడులు నిర్వహణకు సంబంధించి వెంటనే లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చేలా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని లక్షలాదిమంది అంగన్‌వాడీ చిన్నారులకు పోరాటం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీ రాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం రెండు రోజుల్లో మారకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ పెద్దలు దృష్టిలో పెట్టి ప్రకటిస్తామన్నారు.

నేడు విజయవాడలో ఏఐఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశం

దెందులూరు: విజయవాడలో శనివారం ఐలాపురంలో ఉదయం 10 గంటలకు ఏఏఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ న్యాయవాది విరిపే వెంకట రామకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఏఏఎఫ్ గత పదేళ్లుగా అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తుందన్నారు. న్యాయవాదులు అన్ని రంగాల మేధావులు రాష్ట్రస్థాయి సమావేశాలో పాల్గొంటారని, ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

కంటైనర్‌లో తరలిస్తున్న ఆవులు పట్టివేత

దెందులూరు: ఆవులను తరలిస్తున్న కంటైనర్‌ను శుక్రవారం రాత్రి ఆశ్రమం వద్ద దెందులూరు బీజేపీ నాయకులు చంద్రశేఖర్ నిలుపుదల చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఆశ్రమం వద్దకు చేరుకున్నారు. కంటైనర్‌తో పాటు మరి కొన్ని వాహనాల్లో ఆవులను తరలిస్తున్నారని చంద్రశేఖర్ అన్నారు.

కంప్యూటర్ విజ్ఞానం అవసరం

ఏలూరు (టూటౌన్) : కంప్యూటర్ విజ్ఞానం నేడు అందరికీ అవసరమని శ్రీకృష్ణ హాస్పటల్స్ వైద్యులు రాంప్రసాద్ అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 33వ బ్యాచ్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, రిటైర్డ్ మునిసిపల్ మేనేజర్ వై నిర్మల, రిటైర్డ్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఫీజుతో కంప్యూటర్ శిక్షణ కేంద్రం నడపడం అభినందనీయమన్నారు.

మహిళలకు రక్షణ కరువు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యా మల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళా పోలీస్ అధికారికే లేని రక్ష ణ సామాన్య మహిళకు ఉంటుందా? అని ప్రశ్నించారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



భీమడోలులో కారల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భీమడోలు: కారల్ మార్క్స్‌కు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మార్క్స్ 142వ వర్ధంతి కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ లింగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు నిర్మూలించే ఏకైక సిద్ధాంతం కమ్యూనిజమేనన్నారు. చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు తగ్గాయన్నారు. దేశంలోనే కేరళలో అత్యధిక కనీస వేతనం కార్మికవర్గానికి దక్కుతుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కార్మికుల శ్రమను దోచిపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు జి.ప్రసాదరావు, కట్టా భాస్కరరావు, మహిళలు పాల్గొన్నారు.

కొవ్వలి దళితుల భూములకు పట్టాలివ్వాలి

దెందులూరు: కొవ్వలి గ్రామంలో దళితులు,పేదలు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, సాగుకు అవకాశం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రను కొవ్వలిలో ప్రారంభించారు. స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రకు దళనాయకుడుగా సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. రామకృష్ణ వ్యవహరించగా జిల్లా నాయకులు కె. లెనిన్, మండల నాయకులు డి.నాగేంద్ర, పి.ఆనందరావు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొవ్వలి గ్రామంలో 1963 నుంచి బంజర భూమిగా ఉన్న ఆర్‌ఎస్ నెంబర్ 131/4 లో 304 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ప్రభుత్వాలు 101ఎకరాలు వ్యవసాయ క్షేత్రాలకు, 25 ఎకరాలు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు మిగిలిన భూమి భూమిలేని దళితులు,పేదలు సాగుకు అవకాశం కల్పించారు. కానీ గత ఆరునెలల నుంచి కొవ్వలి గ్రామానికి చెందిన వెలమాటి మనోహరి గ్రామ దీపికా ట్రస్ట్ నాయకురాలు కోర్టులో కేసు వేసి పేదలను, దళితులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. వ్యవసాయం చేయటం వల్ల కాలుష్యం ఏర్పడుతుందని వింత వాదనతో కోర్టుకెళ్లడాన్ని రవి తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కొవ్వలి భూ సమస్యపై సీపీఎం పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతుందని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు కె. లెనిన్ మండల నాయకులు ఆనందరావు, నాగేంద్ర కొవ్వలి గ్రామం నాయకులు వెంకట్రావు, రంగారావు, బుజ్జి, బాబు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తికి చెరువులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో రజక వృత్తి నిర్వాహణకు ప్రభుత్వ జీఓల ప్రకారం చెరువులను కేటాయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య కోరారు. శుక్రవారం ఏలూరులోని రజకజన సంఘ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గంలో రజకులకు ఐదు శాతం కూడా చెరువులు కేటాయించక పోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కొమ్మారెడ్డి అనురాధాకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఆగిరిపల్లి మండలం ఈదర రజకులకు సరైన వృత్తి చెరువు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రజకులకు తక్షణమే తెలుగకుంట చెరువు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొమ్మంటి మురళి సాంబశివరావు వి.శ్రీనివాస్, బుద్ధారపు గోపిరాజు, బుద్ధారపు నారాయణ, దర్శేపల్లి జమలయ్య బుద్ధారపు నాగరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో చిన్నారుల నృత్యాలు



భీమడోలులో ప్రవీణ్‌కుమార్ పటేల్ ఇంటా హోలీ సంబరాలు



సందడి చేస్తున్న చిన్నారులు

దెందులూరు: హోలీ వేడుకలను పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగని సాయి హై స్కూల్ డైరెక్టర్ బోయపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గంగన్నగూడెం సాయి హై స్కూల్, దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల్లో విద్యార్థులు సంతోషంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. అనంతరం స్వీట్లు పంచారు. గంగన్నగూడెం సాయి హైస్కూల్లో విద్యార్థుల చేతులపై రంగులు వేసుకుని హోలీ పండుగ ప్రత్యేకను ప్రదర్శన చేశారు.

ఘనంగా హోలీ సంబరాలు
భీమడోలు: హోలీ పర్వదినాన్ని భీమడోలు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు అప్యాయంగా రంగులతో పలకరించుకుంటూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పెద్దలు, మహిళలు, విద్యార్థులు హోలీ సంబరాల్లో పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు. హోలీ విశిష్టత, ప్రాధాన్యతలను వివరించారు. భీమడోలులో బీజేపీ మండల అధ్యక్షుడు ముర్రే మూర్తి ఆధ్వర్యంలో మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ ఇంటా బీజేపీ నాయకులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులను జల్లుకున్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మిద్దే రమాదేవి, మైనార్టీ మోర్చా నాయకులు ఎస్.సుశీలరాణి, పాకిన సత్యనారాయణ, వర్ధినీడి కపిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హోలీ సందడి
పెదవేగి : ప్రతి ఏడాది పాల్గొన మాసంలో వచ్చే హోలీ పండుగను గ్రామాల్లో సందడిగా నిర్వహించారు. పెదవేగి మండలంలోని కవ్వగుంట, విజయరాయి, కొప్పాక గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.